RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | గురువారం | 29 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 282 | పేజీలు : 4 | వెల : 5/-



## నామూషీ!

### 27 జిల్లాల్లో మగపిల్లలే ఎక్కువ

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** సమాజంలో భద్రత లేదు. చివరికి తల్లి కడుపులో కూడా రక్షణ లేదు. ఇలా అయితే ఆడపిల్లల పరిస్థితి ఏంటమ్మా.. కార్తికేయ సినిమాలో నిఖిల్ పలికిన డైలాగ్ ఇది. అచ్చం ఆ డైలాగ్ లాగే తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయి. వారసుడు, ఇంటికి రక్షకుడు, ఇంకా రకరకాల మెరిట్స్ తో మగ పిల్లలు మాత్రమే కావాలనుకునే తల్లిదండ్రుల వల్ల.. ఆడపిల్లలు పుట్టడం లేదు. ఫలి తంగా తెలంగాణ రాష్ట్రంలో లింగ నిష్పత్తి వ్యత్యాసం ఆందోళనకర స్థాయికి చేరుతోంది. రాష్ట్రంలో పలు జిల్లాల్లో పిల్లల జననాల్లో 78శాతం మగ పిల్లలు ఉండడం విశేషం. పెద్దపల్లి జిల్లాలో

మిగతా 2వ పేజీలో...



గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా 9,986 జననాలు నమోదయ్యాయి. ఇందులో 5,181 మంది అబ్బాయిలు పుట్టారు. 4,805 మంది అమ్మాయిలు జన్మించారు. ఇంతటి వ్యత్యాసం సమాజానికి మంచిది కాదని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అన్నిటికి రేషన్ కార్డే

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో పథకాల జాతర మొదలవబోతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో గ్యారంటీలను నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణం చేశారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరిని రెండు రోజులకే న రెండు గ్యారంటీల అమలు ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. ఈ క్రమంలో మిగతా హామీలు కూడా వేగంగా అమలు చేస్తారని అంతా భావించారు. గ్యారంటీల అమలుకు ప్రభుత్వం అభయహస్తం పేరిట దరఖాస్తులు స్వీకరించింది. ఏయే పథకాలకు అర్హులు, ఏయే పథకాలు కావాలో దరఖాస్తు పెట్టుకోవాలని వారం రోజుల సమయం ఇచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్పందన వచ్చింది. 1.20 కోట్ల వరకు దరఖాస్తులు వచ్చాయి. పింఛన్,

మిగతా 2వ పేజీలో...

అసలు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పథకాలు అమలు చేయడంతో దాదాపుగా 20 లక్షల మంది నష్టపోతున్నారు. అర్హత ఉన్నా రేషన్ కార్డు లేని కారణంగానే వీరు పథకాలకు దూరం అవుతున్నట్లు అధికారులే పేర్కొంటున్నారు. అభయహస్తం దరఖాస్తుల్లో రేషన్ కార్డు కోసమే 20 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు గుర్తించారు.





11 వేల టీచర్ పోస్టులతో నాలుగైదు రోజుల్లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు సమాచారం. ఈ నోటి ఫికేషన్‌లోనే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలి గిన పిల్లల కోసం స్పెషల్ టీచర్లను రిక్రూట్ చేయనున్నారు.

## టీచర్ల జాతర!

### 11వేల పోస్టులతో మెగా డీఎస్సీ

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి 'మెగా డీఎస్సీ' నోటిఫికేషన్ విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ వారంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి 'మెగా డీఎస్సీ' నోటిఫికేషన్ విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అన్ని అనుకూలిస్తే.. ఈ వారంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. మెగా డీఎస్సీ ద్వారా దాదాపు 11,060 పోస్టులు భర్తీ చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా డీఎస్సీకి సంబంధించిన

మిగతా 3వ పేజీలో...

## పార్టీ ఫండ్ పలారం!

- పంచుకు తిన్న కేటుగాళ్లు
- రిటైర్డ్ జడ్జికి పంగనామాలు
- పార్టీ చందా పేరిట వసూలు
- రూ.2కోట్లు మింగిన ఘనులు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్ లో ఓ హైకోర్టు రిటైర్డ్ జడ్జి మోసపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి విరాళాల పేరుతో మోసం జరిగినట్లు తెలుస్తోంది. రాజకీయ పార్టీకి బాండ్ల ద్వారా విరాళం ఇవ్వడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు అని కేటుగాళ్లు సదరు జడ్జికి మాయ మాటలు చెప్పి మోసం చేసినట్లు సమాచారం. ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డీ.ఎస్.ఆర్ వర్మ కుటుంబం వద్ద నుంచి నరేంద్ర, కసి రెడ్డి శరత్ రెడ్డి అనే వ్యక్తులు రెండున్నర కోట్లు వసూలు చేశారు. రెండేళ్లు గడిచినా బాండ్లకు సంబంధించిన రశీదులను

మిగతా 3వ పేజీలో...



ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డీ.ఎస్.ఆర్ వర్మ కుటుంబం వద్ద నుంచి నరేంద్ర, కసి రెడ్డి శరత్ రెడ్డి అనే వ్యక్తులు రెండు న్నర కోట్లు వసూలు చేశారు. రెండేళ్లు గడిచినా బాండ్లకు సంబంధిం చిన రశీదులను కేటుగాళ్ళు ఇవ్వ లేదు.

## మోదీ రెండు రోజులు టూర్

- ప్రధాని తెలంగాణ పర్యటన ఖరారు
- మార్చి 4, 5 తేదీల్లో రాష్ట్రంలో బస
- ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో పర్యటన
- బీజేపీ అగ్రనేత అమిత్‌షా టూర్ రద్దు

3లో



ప్రధానమంత్రి మోదీ తెలంగాణ పర్యటనకు రాబోతున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మోదీ వస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## వచ్చినోళ్లకు ఇచ్చినట్టే..!

- కాంగ్రెస్‌లో ఇటీవల చేరిన నలుగురు
- టికెట్ హామీతోనే కప్పుకున్న కండువలు
- సీఎం రేవంత్‌రెడ్డి మాటల్లో తేటతెల్లం
- ఇతర ఆశావహుల్లో అసంతృప్తివాదం

**మహబూబ్‌నగర్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మరికొన్ని నెలలో జరగనున్న పార్ల మెంట్ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో కూడా అసెంబ్లీ ఎన్ని కల ఫలితాలను రిపీట్ చేసేలా కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 17 ఎంపీ సీట్లకు 12 నుంచి 14 సీట్లు కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. అందుకు తగ్గట్టుగానే వ్యూహాలు రచిస్తోంది. సర్వేల ఆధారంగా విజయం సాధించే అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ అగ్ర నేతలు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లుగానే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పోటీ చేసేందుకు ఆశావహులు నుంచి ఇప్ప టికే దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే.ఇప్పటికే ఆశావహుల దరఖా స్తులను రాష్ట్ర నేతలు హై కమాండ్ కు పంపినట్లు సమాచారం.ఇదిలా ఉంటే రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి తాను ప్రాతిని ధ్యం వహిస్తున్న కొడంగల్‌లో పర్యటించిన రేవంత్ రెడ్డి.. బహిరంగ సభ సాక్షిగా మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి అని ప్రకటించారు. ఇక మిగిలిన 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా.. బిఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన నలుగురికి సీట్లు కన్ఫర్మ్ అయినట్లు సమాచారం. బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి

మిగతా 2వ పేజీలో...



## 'బండి' మీద గుడ్లు

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు :** బండి సంజయ్ పై కోడిగుడ్లతో దాడి జరిగింది. ప్రస్తుతం ఆయన కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలంలో ప్రజాహిత యాత్ర నిర్వహిస్తున్నారు. వంగరలో యాత్ర చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బండి సంజయ్ కాన్వాయ్ మీద గుడ్లు విసిరారు. ఈ దాడితో అసహనం చెంది బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు పోలీసు బందోబస్తు ఏం వద్దని.. మీరు వెళ్లిపోండి.. అంటూ

మిగతా 3వ పేజీలో...



## గులాబీ వర్సెస్ కాంగ్రెస్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** మార్చి 1 నుంచి 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి బీఆర్ఎస్ పిలుపునిచ్చింది, మేడిగడ్డకు తాము కూడా వెళ్తామని కేసీఆర్ నల్లగొండ సభలో ప్రకటించారు. ఆయన మాటలకు తగ్గట్లుగా షెడ్యూల్ రూపొందించారు. తెలంగాణ ఎన్నికలు వాతావరణం మంచి వేడి మీద ఉన్న సమయంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగి పోయింది. ఆ విషయాన్ని పెద్దగా హైలెట్ కాకుండా బీఆర్ఎస్ జాగ్రత్త పడింది. కానీ తర్వాత కృష్ణా జలాల అంశాన్ని బీఆర్ఎస్ అందుకోవడంతో కౌంటర్ ఇచ్చేందుకు కాంగ్రెస్ మేడి గడ్డను అందుకుంది. మీడియాను.. ఎమ్మెల్యేలను మేడిగడ్డకు తీసుకు వెళ్లి పగుళ్లను చూపించింది. నివేదిక ప్రకారం ఇప్పుడు రిపేర్లు చేయడం సాధ్యం కాదని.. ఆ పిల్లర్లు తొలగించి కొత్తగా నిర్మించాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. అలాగే మరో రెండు బ్యారేజీల్లోనూ సమస్యలు ఉన్నాయని నివేదికలు వచ్చాయి. ఈ విషయంలో డాక్యుమెంట్లు ముందు పెట్టి కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోంది. కాళేశ్వరంపై కాగ్ ఇచ్చిన రిపోర్ట్ .. బీఆర్ఎస్ నేతలకు మరింత ఇబ్బందికరం. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ లో 63,352 కోట్లు చూపెట్టగా.. లక్షా 6 వేల కోట్లకు అంచనా వ్యయం పెంచినట్లు కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది. ఇదే సమయంలో మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యే వరకు లక్షా 47 వేల 427 కోట్లు ఖర్చు అవుతుందని స్పష్టం చేసింది కాగ్. కాళేశ్వరం కోసం తెచ్చిన రుణాలలో ప్రతి ఏటా14 వేల 462 కోట్లు రుణాల చెల్లించాలని కాగ్ నివేదికలో చెప్పింది. వసరం లెకున్న 3 టీఎంసీలకు ప్రతిపాదన పెంచారని చెప్పింది. దింతో 28 వేల151 కోట్ల అదనపు వ్యయం ఏర్పడ్డదని తెలిపింది. కాళేశ్వరం నిర్వహణకు 10 వేల

మిగతా 2వ పేజీలో...





తెలంగాణ ఎన్నికలు వాతావరణం మంచి వేడి మీద ఉన్న సమయంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగి పోయింది. ఆ విషయాన్ని పెద్దగా హైలెట్ కాకుండా బీఆర్ఎస్ జాగ్రత్త పడింది. కానీ తర్వాత కృష్ణా జలాల అంశాన్ని బీఆర్ఎస్ అందుకోవడంతో కౌంటర్ ఇచ్చేందుకు కాంగ్రెస్ మేడి గడ్డను అందుకుంది.

## నాగర్‌కర్నూలు ఎంపీ జంపేనా...

పోతుగంటి రాములు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ. ప్రస్తుతం నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతం లో టీడీపీలో ఉన్న ఆయన ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున నాగర్ కర్నూల్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు.



3లో

## ఇంటర్ పరీక్షలు షురూ

బుధవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పరీక్ష రాయడానికి పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు.



3లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి ఆత్మహత్య

**ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కి ఉరి వేసుకున్న శ్రీధర్(48) అనే వ్యక్తి**



**మేడ్చల్ - ప్రభాతసూర్యుడు :** మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈస్ట్ ప్రగతి నగర్ లో శ్రీధర్ అనే వ్యక్తి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. కొడుకు ఆత్మహత్య ఘటన చూసిన తల్లి విజయ (73) కూడా అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న మల్కాజ్గిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత కొంతకాలంగా శ్రీధర్ మరియు అతని భార్య మధ్య డైవర్స్ కేసు నడుస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.



# పాతబస్తీలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర


**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** పాత బస్తి నుంచి యాఖత్ పురా అసెంబ్లీ ఐ ఎస్ సదన్ చౌరస్తా కు చేరుకున్న విజయ సంకల్ప యాత్ర కు ప్రజలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంపీ డా లక్ష్మణ్ మాట్లాడారు. మోదిని మూడో సారి ప్రధాని చేయాలని ప్రజల మద్దతు కూడగట్టుకుంటూ విజయ సంకల్ప యాత్ర ప్రారంభించామని తెలిపారు. ట్రిపుల్ తలక్ రద్దు చేసి ముస్లిం మహిళలకి అన్నగా నిలిచిన వ్యక్తి మన మోది యని కొనియాడారు. హిందువుల కోసం అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని చేపట్టిన గొప్ప వ్యక్తి మన నరేంద్ర మోది అన్నారు. రాముడే లేదు..రామునికి గుడి ఎందుకు అన్న కాంగ్రెస్ పార్టీ. ఇపుడు రాజకీయం కోసం దేవుడి పేరు వాడుకుంటున్నారని విమర్శిం చారు. రాముడే లేదని మాట్లాడిన కాంగ్రెస్ కావాలో.. రామునికి గుడి కట్టిన మోది కావాలో ప్రజలు ఆలోచించాలని ప్రశ్నించారు. కర్ణాటక ఎమ్మెల్సీ నసీర్ షా గెలిచిన ల్సందర్భంగా పాకిస్థాన్ జిందాబాద్ అని నినాదాలు చేశారని గుర్తు చెసారు. మన దేశంలో ఉంటూ, మన దేశ తిండి తింటూ, మన ప్రజలతో ఎన్నుకోబడ్డ కాంగ్రెస్ నేతలు పాకిస్థాన్ కి జిందాబాద్ అనడం సిగ్గు చేటని అన్నారు.వెంటనే కాంగ్రెస్ అధిష్టానం వాళ్ల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారుదేశం సస్యసామలంగా ఉండాలంటే మోది ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు కాంగ్రెస్ , బిఆర్ఎస్ పార్టీ లు ఓవైసీ తొత్తులుగా మారి పాత బస్తి నీ డెవలప్ జరగకుండా చేస్తున్నారని ఆరోపించారు. బి అర్ ఎస్ కెసిఆర్ కుటుంబం కోసం పని చేస్తుందని.కాంగ్రెస్ నెహ్రూ కుటుంబం కోసం పని చేస్తుందని.కానీ బిజెపి పార్టీ మోది సర్కార్ మాత్రం ప్రజల కోసం దేశం కోసం పని చేస్తుందని చెప్పారు. పాత బస్తీ బాగుపడాలంటే బిజెపి నీ గెలిపించాల్సిం దనని. ఎక్కడ చూసినా ఫిర్ ఏక్ బార్ మోది సర్కార్ అనే నినాదం వినిపిస్తుందని తెలిపారూ. ఈ సారి హైదరాబాద్ పార్లమెంట్ లో బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలోజిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి. కార్పొరేటర్లు జంగం శ్వేతా మధుకర్ రెడ్డి.కొత్త కాపు అరుణ.భాగ్య లక్ష్మీ. మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ. జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపి బండి సంజయ్‌పై మండిపడ్డ మంత్రి పొన్నం



**రాజన్న సిరిసిల్ల -ప్రభాతసూర్యుడు :** వేములవాడ లో ఎంపీ బండి సంజయ్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. బిజెపి జాతీయ ప్రధానకార్యదర్శి హోదాలో ఉండి ఎమ్మెల్యే గా గెలువలేని సంజయ్ ఎంపీ అట.. తూ.. అని ఉమ్మారు. అమ్మను అవమానపర్చిన మూర్ఖుడు సంజయ్. బండి సంజయ్ మాటలతో మా అమ్మ ఏడుస్తుంది... నేను బాధపడ్డా.రాముని జన్మభూమి ఎక్కడ అని నేను అనని మాటలను తనకు ఆపాదించి నీ అమ్మా అన్నాడు. నేను రాముని జన్మస్థలం గురించి మాట్లాడినట్లు నిరూపిస్తే-సజీవ దహనానికి సిద్ధం. అమ్మ ప్రస్తావన తీసుకవచ్చింది ఎవడు, హుస్నాబాద్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద మా అమ్మ క్షోభిస్తుందని అన్న వెదవ ఎవడని ప్రశ్నించారు. మళ్ళీ అమ్మ కాళ్ళు మొక్కుతా అంటున్నవా? అమ్మా పేరుతో రాజకీయం చేస్తున్నానని హుస్నా బాద్‌లో అన్నాడు. నేను హిందువుని, మాంసంహారం కూడ తినను. ఐదేళ్ళు ఎక్కడ కనిపించని బండి సంజయ్ ఇన్ని రోజులు ఎక్కడ పోయాడు.. ఏం చేశాడని నిలదీయండి. ఏనాడూ అయిన కుటుంబ సభ్యుల గురించి మాట్లాడుకున్నామా. రాజన్న గుడికి నీవు ఎం చేశావ్ చెప్పు బండి సంజయ్. ఎన్నికల్లో ఓట్ల కోసం పెండ్లాం మంగళ సూత్రాలు అమ్ముకున్న నీవు ఇలా మాట్లాడుతావా. ఎంపీగా గెలిస్తే నన్ను రాజీనామా చేస్తావా అంటావా సిగ్గు ఉందా? మూడు వందల మంది పోలీసులతో యాత్ర చేస్తున్నావని మండిపడ్డారు.

# నామూషీ!



**మొదటిపేజీ తరువాయి..**
నమోదయిన జననాల్లో 69 శాతం అబ్బాయిలే పుట్టారంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దర్జాగా జరుగుతున్న లింగ నిర్ధారణ పరీక్షలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ వ్యత్యాసం ఇలాగే ఉంటే యువకులకు భవిష్యత్తులో పెళ్లిళ్లు అవడం కష్టమే.ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఈ -బర్త్ పోర్టల్ గణాంకాలు విడుదల చేసింది. ఈ ప్రకారం జనవరిలో జన్మించిన పిల్లల్లో 52 శాతం మగ పిల్లలే ఉన్నారు. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా 9,986 జననాలు నమోదయ్యాయి. ఇందులో 5,181 మంది అబ్బాయిలు పుట్టారు. 4,805 మంది అమ్మాయిలు జన్మించారు. ఇంతటి వ్యత్యాసం సమాజానికి మంచిది కాదని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సమాజంలో మగ పిల్లల సంఖ్య అధికంగా ఉంది. ఆడపిల్లల సంఖ్య తగ్గుతోంది. ఇటీవలి గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 988 మంది అమ్మాయిలున్నారు.. దీనివల్ల చాలామంది యువకులకు పెళ్లిళ్లు జరగడం లేదు. దీంతో వారు పెళ్లి కానీ ప్రసాదు ల్లాగానే మిగిలిపోతున్నారు.ప్రణాళిక సంఘం గణాంకాల ప్రకారం బాలల లింగ నిష్పత్తికి సంబంధించి వెయ్యి మంది బాలురకు 932 బాలికలు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 1000 మంది పురుషులకు 999 మంది స్త్రీలు ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో వెయ్యి మంది పురుషులకు 970 మంది స్త్రీలున్నారు. ఇక వైద్య ఆరోగ్యశాఖ ఈ బర్త్ పోర్టల్ జనవరి లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో నమోదైన జననాల ప్రకారం 78 శాతం మంది అబ్బాయిలే జన్మించారు. అత్యంత మారుమూల జిల్లా అయిన ములుగులో మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. అక్కడ అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా జన్మించడం విశేషం. పెద్దపల్లి జిల్లాలో అబ్బాయిల జననాల రేటు ఎక్కువగా ఉంది. మహబూబాబాద్ లో 60%, నల్లగొండ లో 56%, సూర్యాపేట లో 55%, ఆదిలాబాద్, మేడ్చల్ లో 54 %, ఖమ్మం, మంచిర్యాల జిల్లాల్లో 53% అబ్బాయిలే పుట్టారు. ములుగు జిల్లాతో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల్లో మగ పిల్లల కంటే అమ్మాయిల జననాలే ఎక్కువగా నమోదయ్యాయి.ఇక రాష్ట్రంలో ఏడు జిల్లాల్లో ఆడపిల్లల జననాల శాతం అధికంగా నమోదయింది. జయశంకర్ భూపాలపల్లి 62 %, నిర్మల్ 54.2%, వికారాబాద్ 53%, కొమరం భీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం 52%, జగిత్యాల 51%, రాజన్న సిరిసిల్ల 51.55% గా ఆడపిల్లల జననాలు ఉండడం విశేషం. ఏడు జిల్లాల్లో నాలుగు జిల్లాలు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నవే. అయినప్పటికీ అక్కడ ఆడపిల్లల జనాలు అధికంగా ఉండడానికి ప్రధాన కారణం ఆసుపత్రులు తక్కువగా ఉండటం. మిగతా ప్రాంతాల్లో ప్రైవేటు ఆసుపత్రులు ఎక్కువగా ఉండడం, లింగ నిర్ధారణ కేంద్రాలు అడ్డగోలుగా గర్భస్రావాలు చేయడం వల్ల ఆడపిల్లల సంఖ్య తగ్గుతోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ వ్యత్యాసం ఇలానే కొనసాగితే రెండు దశాబ్దాల తర్వాత యువకులకు పెళ్లిళ్లు కావడం కష్టమని పలువురు నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# అన్నిటికి రేషన్ కార్డ్డే

**మొదటిపేజీ తరువాయి..**
ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గృహలక్ష్మి, తదితర పథకాలకు దరఖాస్తులు వచ్చాయిఇక అభయహస్తం దరఖాస్తుల నుంచే రేవంత్ ప్రభుత్వం రేషన్ కార్డు తప్పని సరి చేసింది. అయితే దీనిపై వ్యతిరేకత వచ్చింది. రేషన్ కార్డు తప్పనిసరి అయితే మొదట రేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రేషన్‌కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రేషన్ కారుడ్లు కావాల్సిన వారు దరఖాస్తుపై రేషన్ కార్డు కావాలని పేర్కొనాలని సూచించింది.దరఖాస్తులు స్వీకరించి నెల దాటినా పథకాల అమలు ప్రారంభించకపోవడంతో ప్రతిపక్షాలు నిలదీయడం ప్రారంభించాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ సాకుగా చూపి గ్యారంటీలు అమలు చేయకుండా తప్పించుకోవాలని రేవంత్ సర్కార్ చూస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్ మరో రెండు గ్యారంటీల అమలుకు కసరత్తు మొదలు పెట్టింది.ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, రూ.500లకే ఎల్‌పీజీ సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు ఈ రెండు పథకాలను ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. అయితే ఇక్కడే ప్రభుత్వం ట్విస్టు ఇచ్చింది. ఈ రెండు హామీలకు రేషన్ కార్డు తప్పనిసరి చేసింది. రేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ అందిస్తామని ప్రకటించింది.తర్వాత అమలు చేసే పథకాలకు కూడా రేషన్ కార్డు తప్పనిసరి చేస్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందిరమ్మ ఇల్లు, గృహలక్ష్మి, పింఛన్, విద్యార్థులకు రుణ భరోసా కార్డులు, విద్యార్థినులకు స్కూటీలు తదితర పథకాలకు కూడా రేషన్ కార్డు ప్రమాణికంగా తీసుకుంటారని అధికారులే చెబుతున్నారు.అసలు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పథకాలు అమలు చేయడంతో దాదాపుగా 20 లక్షల మంది నష్టపోతున్నారు. అర్హత ఉన్నా రేషన్ కార్డు లేని కారణంగానే వీరు పథకాలకు దూరం అవుతున్నట్లు



అధికారులే పేర్కొంటున్నారు. అభయహస్తం దరఖాస్తుల్లో రేషన్ కార్డు కోసమే 20 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో మొదట రేవంత్ సర్కార్ రేషన్ కార్డులు ఇవ్వాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు. రేషన్ కార్డులు జారీ చేయకుండా అన్ని పథకాలకు రేషన్ కార్డును ప్రమాణికంగా పెట్టడంపై మండిపడుతున్నారు.

# వచ్చినోళ్లకు ఇచ్చినట్టే..!

**మొదటిపేజీ తరువాయి..**
కాం గ్రెస్ పార్టీలో చేరిన వారిలో పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ నేతకు అదే స్థానం కేటాయిస్తారని ప్రచారం జరుగుతుంది. ఇక మాజీమంత్రి పట్నం మహేందర్ రెడ్డి సతీమణి, వికారాబాద్ జెడ్పీ ఛైర్పర్సన్ పట్నం సునీత మహేం దర్‌రెడ్డికి చేవెళ్ల.. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు సికిం ద్రాబాద్ టికెట్.. అలాగే సినీనటుడు అల్లు అర్జున్ మేనమామ కంచర్ల చం ద్రశేఖర్ రెడ్డికి మల్కాజిగిరి టికెట్ ఖరారు అయినట్లు ప్రచారం జరుగు తుంది. వీరితో పాటు కాంగ్రెస్ సీని యర్ నేతలు జానారెడ్డికి నల్గొండ ఎంపీ టికెట్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి నిజామాబాద్, సురేష్ కుమార్ షెట్కర్‌కు జహీరాబాద్ ఎంపి టికెట్లు కేటాయించినట్లు వార్తలు వస్తున్నాయి. వీరి అభ్యర్థిత్వానికి పార్టీ హైకమాండ్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు పార్టీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. వంశీ చంద్ రెడ్డికి ఇప్పటికే టికెట్ కన్ఫర్మ్ కాగా ఈ ఏడు స్థానాలకు కూడా దాదాపు అభ్యర్థులు ఖరారు అయినట్లే కనిపిస్తోంది.ఇక మిగిలిన 9 స్థానాల్లో బలమైన కాంగ్రెస్ అభ్యర్థుల కోసం కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తుంది. పట్నం దంపతులకు వికారాబాద్ జిల్లా రాజకీయాల్లో మంచి పట్టు ఉండడంతో పట్నం మహేందర్ రెడ్డి సతీమణి సునితకు చేవెళ్ల టికెట్ కేటాయించేందుకు నేతలు సిద్ధమయ్యారు. ఇటు వెంకటేష్ నేత పెద్దపల్లిలో సిట్టింగ్ ఎంపీ కావడంతో ఆయనకు మరోసారి అదే స్థానం నుంచి అవకాశం కల్పించనున్నారు. ఇక దేశంలోనే పెద్ద నియోజకవర్గం అయిన మల్కాజిగిరిలో కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి ని బరిలో దింపితే అల్లు అర్జున్ సినీ గ్లామర్ మామ గెలుపుకు కలిసి వస్తుందని పార్టీ భావిస్తోంది. ఇటు బొంతు రామ్మోహన్ ఉ ద్యమకారుడు కావడం, గతంలో హైదరాబాద్ మే-యర్‌గా పని చేయడం, తన సతీమణి చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ శ్రీదేవి యాదవుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఉండడంతో ఆయనను సికింద్రాబాద్ నుంచి బరిలో దింపేందుకు పార్టీ యోచిస్తోంది. ఏది ఏమైనప్పటికీ బిఆర్ఎస్ నుంచి వలస వచ్చిన ఆ నలుగురికి టిక్కెట్లు కన్ఫర్మ్ అయినట్లే కనిపిస్తోంది.



# గులాబీ వర్సెస్ కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి..**
కోట్లు పడుతోందని తెలిపింది. ఆర్థికంగా కూడా ఏ మాత్రం లాభదాయకం కాదని.. రాష్ట్రం మొత్తానికి అవసరమైన కరెంట్ వాడాలని కూడా స్పష్టం చేసింది. కరెంట్ బిల్లులకు అయ్యే ఖర్చు కూడా వెనక్కి రాదని తెలిపింది. ఇది.. బీఆర్ఎస్ నేతల వైఫల్యాన్ని బయటపెట్టేదిలానే ఉంది. కాళేశ్వరం అంశాన్ని ఎంత కాలం లైవ్‌లో ఉంచితే తమకు అంత మేలని.. తెలంగాణను ఎలా దోచ ుకున్నారని అందరికీ ఎప్పటికప్పుడు గుర్తు చేసినట్లు అవుతుందని కాంగ్రెస్ నేతలంటున్నారు. కాళేశ్వరం విషయంలో మేడిగడ్డ లాంటి వైఫల్యం కళ్ల ముందే ఉన్నప్పుడు బీఆర్ఎస్ మరింత భిన్నమైన వ్యూహాన్ని పాటించాల్సి ఉంది. ఆ అంశాన్ని మరుగున పడేలా చేయాల్సిల ఉంది. కేటీఆర్ వ్యూహం ఏమిటో కానీ.. బీఆర్ఎస్ నేతలకు కూడా మేడిగడ్డ అంశాన్ని లైవ్‌లో ఉంచి సాధించుకునేదేమిటన్న సందేహం వ్యక్తమవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే మేడిగడ్డ ఒక్కటే కాదనేది కేటీఆర్ వాదన. ఈ విషయం పై ప్రజలకు అవగాహన కల్పించాలనుకుంటున్నారు. కాళేశ్వరం అంటే ఒక మేడిగడ్డ మాత్రమే కాదని.. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంప్ హౌజ్ లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలో మీటర్ల మేర కాలువలు, 98 కిలో మీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు నీళ్ల ఎత్తిపోత, 240 టీఎంసీల వినియోగం.. ఇలా అన్నింటి సమహా-రమే కాళేశ్వరం అని కేటీఆర్ వాదన. అందుకే అన్నీ



చూపిస్తామంటున్నారు. ఎన్ని చూపించినా.. వాటి వల్ల కలిగిన ప్రయోజనం పై చర్చను కాంగ్రెస్ పెడుతుంది. ప్రతీ సారి మేడిగడ్డ పగుళ్ల అంశాన్ని హైలెట్ చేస్తుంది. ఎలా చూసినా కళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రజల్లో చర్చ పెట్టుకోవడం తెలివైన రాజకీయం ఉండదన్న వాదన సహజంగానే రాజకీయవర్గాల్లో ఉంది. అయితే కేటీఆర్ అదే కాళేశ్వరం తమకు ప్లస్ అవుతుందని అనుకుంటున్నారు. కానీ.. మేడిగడ్డ కుంగుబాటు జరగకపోతే ఆయన ప్రయత్నాల్లో కాస్త ఫలితం కనిపించేదమో కానీ ఇప్పుడు అలాంటి అవకాశం లేదన్న వాదన వినిపిస్తోంది. మార్చి ఒకటో తేదీన మరోసారి కాళేశ్వరం వ్యవహారంలో అవకతవకలు.. మేడిగడ్డ కుంగుబాటు.. అవినీతి.. అన్నీ మరోసారి చర్చకు రానున్నాయి. దీని వల్ల తమకే మేలు జరుగుతుందని కేటీఆర్ అనుకున్నట్లుగా జరిగితే బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో మేలు జరుగు తుంది. రివర్స్ అయితే మరింత మైనస్ అయ్యే అవకాశం ఉంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## పెద్దపల్లి జిల్లాలో బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్

**సుల్తానాబాద్ మున్సిపల్ హస్తగతం**

**పెద్దపల్లి - ప్రభాతసూర్యుడు :** పెద్దపల్లి జిల్లాలో బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. జిల్లాలోని సుల్తానాబాద్ మున్సిపల్ హస్తగతం అయింది. సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన గాజుల లక్ష్మి గంటలోనే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇటీవల చైర్ పర్సన్ ముత్యం సునీతపై అవిశ్వాసం నెగ్గిన విషయం తెలిసిందే. తరువాత రెండో వార్డ్ కౌన్సిలర్ గాజుల లక్ష్మిని ఏకగ్రీవంగా చైర్పర్సన్ గా కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. చైర్ పర్సన్ గా ఎన్నికైన గంటలోనే కాంగ్రెస్ పార్టీ తీర్థం గాజుల లక్ష్మి పుచ్చుకున్నారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆహ్వానించారు.






## మోదీ రెండు రోజులు టూర్

- ప్రధాని తెలంగాణ పర్యటన ఖరారు
- మార్చి 4, 5 తేదీల్లో రాష్ట్రంలో బస
- ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో పర్యటన
- బీజేపీ అగ్రనేత అమిత్‌షా టూర్ రద్దు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు రాబోతున్నారు. లోక్ సభ ఎన్నికలకు ముందు మోదీ వస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ మార్చి 4వ తేదీన.. అదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. మార్చి 5న సంగారెడ్డి జిల్లాల్లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ మోదీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అంతేకాకుండా, మోదీ కొన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా పాల్గొనడానికి వస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా నాందేడ్ అఖోలా నేషనల్ హైవేని మోదీ జాతికి అంకితం చేసే అవకాశం ఉంది. అనంతరం సంగారెడ్డిలో జరిగే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొననున్నట్టు సమాచారం. మరోవైపు మార్చి 4న తెలంగాణలో జరగాల్సిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన రద్దు అయింది. మార్చి 4న ఉదయం పదిన్నర నుంచి 11 గంటల వరకు ఆదిలాబాద్‌లో కొన్ని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంఖుస్థాపన చేస్తారు. మరికొన్ని ప్రాజెక్టులను ప్రారంభోత్సవం చేస్తారు. 11.15 గంటల నుంచి 12 గంటల వరకు ఆదిలాబాద్ లోనే బహిరంగ సమావేశంలో పాల్గొంటారు.

## మహ్మదాపురంలో మంత్రి పొంగులేటి పర్యటన

**ఖమ్మం - ప్రభాతసూర్యుడు :** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురంలో రూ. 5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న గిరిజన మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులకు రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖా పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం శంకుస్థాపన చేసారు. తరువాత తిరుమలాయపాలెం మండల కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథక 30 మంది లబ్ధిదారులకు మంత్రి చెక్కుల పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ మీ అందరి దీవెనలతో ఎమ్మెల్యే గా ఎన్నికైనా. ఈ స్థాయిలో ఉండటానికి కారణం ప్రజలు పెట్టిన భిక్ష. పదవులు, అధికారం శాశ్వతంకాదు. రాజకీయాల్లోకి వచ్చిన 11 నెలల లోనే ఎంపీ అయ్యా. పదవున్నా లేకపోయినా ప్రజలు నన్ను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నారు. హాస్టల్ మాత్రమే ఉండి క్లాస్ రూమ్ లు లేకపోవడంతో 5 కోట్లతో పాఠశాలనిర్మించాం. గడిచిన 80 రోజుల్లో ప్రభుత్వం ఏం చేస్తుందో మీరు చూస్తున్నారు. ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు పథకం,రాజీవ్ ఆరోగ్యశ్రీలో 10 లక్షల పథకం అమలు చేసాం. మరో రెండు కార్యక్రమలు అమలు చేస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యంలో మాట ఇస్తే ఎంత కష్టం అయినా ఈ ప్రభుత్వం నెరవేరుస్తుంది. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల్లో తప్పులు ఉంటే మళ్లీ అప్లై చేసుకోవచ్చు. 500లకే గ్యాస్ ఇస్తున్నాం. అర్హులైన వారందరికీ ఇస్తామని అన్నారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం లో వేలాది ఎకరాల కబ్జా చేశారు. గత ప్రభుత్వంలో ధరణిలో ఇచ్చిన అప్లికేషన్ లు వెనక్కి పంపించారు. ధరణిలో వచ్చిన రెండు లక్షల నలబై ఐదు వేల అప్లికేషన్ లను పరిష్కరిస్తాం తెల్ల రేషన్ కార్డులను త్వరలోనే ఇస్తామని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళు ఇస్తాం అని చెప్పి వంద ల్లో మాత్రమే కేసీఆర్ ఇచ్చాడు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు,మహిళలకు 2500 త్వరలోనే ఇస్తాం. మొన్నటి వరకు అధికారం లో ఉన్నవారు 7 లక్షల కోట్ల అప్పులు చేసారు . గత పాలకులు ప్రాజెక్టు లను చిత్త శుద్ధి తో కట్టామని చెపుతున్నారు తప్ప చేసిన తప్పులు ఒప్పుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం. గత ప్రభుత్వం లో ప్రజలకు జరిగిన నష్టాన్ని సరిదిద్దే పనిలో ఉన్నా. మీకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని అన్నారు.



## నాగర్ కర్నూలు ఎంపీ జంపేనా...

**మహబూబ్‌నగర్, ప్రభాతసూర్యుడు :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్ఎస్... ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. నియోజకవర్గాలవారీగా సమీక్షలు చేస్తూ... కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే అధికారం కోల్పోయిన నేపథ్యంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికలు అత్యంత సవాల్‌గా మరాయి. ఈ క్రమంలో బలమైన అభ్యర్థులను బరిలో ఉంచి మెజార్టీ ఎంపీ సీట్లను గెలుచుకోవాలని భావిస్తోంది. గత తప్పిదాలను పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చూస్తోంది. అయితే తాజాగా నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి సిట్టింగ్ ఎంపీ దూరంగా ఉన్నారు. దీంతో ఆయన దారెటు..? అన్న చర్చ మొదలైంది. పోతుగంటి రాములు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ. ప్రస్తుతం నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో టీడీపీలో ఉన్న ఆయన ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున నాగర్ కర్నూల్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఆయన కుమారుడైన భరత్ కల్వకుర్తి జడ్పీటీసీగా కూడా ఉన్నారు. అప్పట్లో ఆయన కుమారుడు భరత్ ను జెడ్పీ ఛైర్మన్ గా చేసేందుకు కూడా పావులు కదిపారు రాములు. కానీ పార్టీలోని పలువురు నేతల నుంచి అభ్యంతరాలు రావటంతో సీన్ మారిపోయింది. అప్పట్నుంచి అసంతృప్తిగానే ఉన్నారు రాములు. దీనికితోడు గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తన కుమారుడిని అచ్చంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయించేందుకు కూడా ప్రయత్నాలు చేసినప్పటికీ. అధినాయకత్వం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బాల్ రాజుకే సీటు ఖరారు చేసింది. దీంతో పార్టీ తీరుపై తీవ్రమైన అంసతృప్తితో ఉన్న రాములు. పార్టీకి దూరంగా ఉంటున్నారు. త్వరలోనే ఆయన పార్టీ మారే అవకాశం ఉందన్న చర్చ కూడా జోరుగా జరుగుతుంది. ఎంపీ రాములు బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరుతారనే చర్చ వినిపిస్తోంది. ఇప్పటికే మందా జగన్నాథం కూడా బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరారు. ఆయన నాగర్ కర్నూలు ఎంపీ టికెట్ ను ఆశిస్తున్నారు. రాములు కూడా టికెట్ ఖరారుపైనే ఆశలు పెట్టుకున్నారని మరోసారి బరిలో ఉండాలని చూస్తున్నారని సమాచారం. కానీ కాంగ్రెస్ లో మల్లు రవి, జగన్నాథం, సంపత్ కుమార్ రేసులో ఉన్నారు. తీవ్రమైన పోటీ నేపథ్యంలో రాములుకు టికెట్ దక్కకపోవచ్చన్న చర్చ కూడా ఓ సైడ్ నుంచి వినిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రాములు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్‌గా మారింది.





## ప్రారంభమయిన ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పరీక్ష రాయడానికి పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,521 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు. 9,80,978 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని పలు కాలేజీల వద్ద పరీక్ష రాయడానికి విద్యార్థులు ఉదయం 8 గంటల నుండి చేరుకున్నారు. తొమ్మిది గంటల లోపు ఒక్కక్షణం ఆలస్యమైన విద్యార్థులను అనుమతించమని అధికారులు ఆంక్షలు విధించారు. దీంతో విద్యార్థులు ఉదయం నుండే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పటాన్ చెరువు చెందిన విద్యార్థి 30 నిమిషాలు లేట్ రావడంతో ఎగ్జామ్ హాల్‌కు అనుమతించక పోవడంతో ఒక విద్యార్థి వెనుతిరిగాడు. వికారాబాద్ కేంద్రంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలకు ఇంటర్ ఏగ్జామ్ కు ముగ్గురు విద్యార్థులు ఐదు నిమిషాలు లేటుగా వచ్చినందుకుగాను విద్యార్థులను అధికారులు వెనక్కి పంపించారు.

## పార్టీ ఫండ్ ఫలారం!

**మొదటిపేజీ తరువాయి..**



కేటుగాళ్ళు ఇవ్వ లేదు. బాండ్ల పేరుతో విరాళాలు చట్ట విరుద్ధం అంటూ ఇటీవల సుప్రీం కోర్టులో తీర్పు వచ్చిన సంగతి తెలిసిందే. అప్రమత్తం అయి రెండున్నర కోట్ల గురించి విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ వర్మ వాకబు చేశారు. దీంతో వారు సదరు పార్టీకి డబ్బులు చెల్లించకుండా సొంతానికి వాడుకున్నారని ఆయనకు తెలిసింది. వెంటనే తాను మోసపోయానని తెలుసుకొని ఆయన ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐపీసీ 406, 420 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద ఫిలిం నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## 'బండి' మీద గుడ్లు

**మొదటిపేజీ తరువాయి..**

పోలీసులపై బండి సంజయ్ ఫైర్ అయ్యారు. కోడిగుడ్ల దాడితో అసహనం చెంది పోలీసు బందోబస్తు నాకు ఏమీ వద్దు.. మీరు వెళ్లిపోవాలని చెప్పిన బండి సంజయ్. వరంగల్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో ప్రజాహిత యాత్ర చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బండి సంజయ్ కాన్వాయ్ మీద గుడ్లు విసిరారు. వంగరలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఇంటిని బండి సంజయ్ సందర్శించారు. ఆ తర్వాత ముల్కనూర్ బయల్దేరుతుండగా ఇద్దరు వ్యక్తులు కోడిగుడ్లు విసిరినట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాన్వాయ్‌లోని మీడియా వాహనంపై పడ్డాయి. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలే ఈ తప్పుడు చర్యకు పాల్పడ్డారని బీజేపీ నేతలు ఆరోపించారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదని అన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ పోలీసుల సమక్షంలో కోడిగుడ్లతో దాడి జరిగినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు పోలీసుల భద్రత అవసరం లేదని.. పోలీసులు తనతో రావొద్దని సూచించారు. తన రక్షణ తమ కార్యకర్తలే చూసుకుంటారని బండి సంజయ్ అన్నారు.



## తాగుబోతు కొడుకును హతమార్చిన తండ్రి

**రంగారెడ్డి - ప్రభాతసూర్యుడు :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది,రోజు తాగి వచ్చి ఇంట్లో వాళ్ళని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు అని కోపం తో కన్న కొడుకు వినయ్ ని తండ్రి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం అర్ధరాత్రి పార తో కొట్టి చంపివేసాడు. వినయ్ 5 సంవత్సరాల క్రితం ప్రవలిక అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక రెండు సంవత్సరాల పాప రక్షిత వుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియ ఆసుపత్రి కి తరలించారు.

## జూబ్లీహిల్స్‌లో కిడ్నాప్..దాడి

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** జూబ్లీ హిల్స్ పీ ఎస్ పరిదిలో కిడ్నాప్, దాడి ఘటన లో ఇద్దరు యువకులకు గాయాలు అయ్యాయి. గతంలో తమ మీద డ్రగ్స్ కేసు పెట్టారని కక్ష్యతో ఇద్దరు యువకులను మరికొంత మంది యువకులు కిడ్నాప్ చేసి చితక బాదారు. .యూసుఫ్ గూడా గాయత్రి హిల్స్ లో అర్ధరాత్రి వీరంగం నడిచింది. వెంకట గిరికి చెందిన అక్బర్. యూసుఫ్ గూడా కు చెందిన సాయి అనే యువకుల మీద దాడి జరిగింది. బాధితులు జూబ్లీ హిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసారు.

## టీచర్ల జాతర!

**మొదటిపేజీ తరువాయి..**

నివేదికను విద్యాశాఖ సిద్ధం చేసి సీఎం కార్యాలయానికి పంపింది. అక్కడి నుంచి అనుమతి రాగానే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే డీఎస్సీ నిర్వహణపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. మెగా డీఎస్సీద్వారా టీచరు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టీచర్ల పదోన్నతులు, బదిలీల్లో ఇబ్బందులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు లేరనే సాకుతో మూసేసిన బడులను మళ్లీ తెరిపించాలని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నా.. బడి నడవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలో బడి ఉండాల్సిందేనని అన్నారు. బడి లేని కారణంగా విద్యార్థులు చదువులకు దూరం కావొద్దని, చదువుల కోసం వేరు గ్రామాలు, పట్టణాలకు పోయే పరిస్థితులు ఉండొద్దని పేర్కొన్నారు. ఇందుకోసం మెగా డీఎస్సీ వేయాలని, అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం 5059 పోస్టులలో డీఎస్సీని విడుదల చేసిన సంగతి తెలిసిందే. విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ 1739, పండిట్ పోస్టులు 611, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 164, ఎస్జీటీ పోస్టులు 2,575 పోస్టులున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చెప్పిన ప్రకారం 13 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయినా ప్రభుత్వం వారి ఆవేదనను పట్టించుకోకుండా నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష తేదీలను కూడా ప్రకటించింది. అయితే ఎన్నికల కారణంగా అది వాయిదా పడింది. అయితే ఆ సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు గత నోటిఫికేషన్ ను రద్దు చేసి, 11 వేల టీచర్ పోస్టులతో నాలుగైదు రోజుల్లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు సమాచారం. ఈ నోటిఫికేషన్‌లోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం స్పెషల్ టీచర్లను రిక్రూట్ చేయనున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసింది. తుది ఫలితాలు వెల్లడికి అడ్డంకిగా మారిన కోర్టు కేసులు, ఇతర కారణాలను న్యాయనిపుణులతో చర్చించి పరిష్కరించింది. పోలీస్, గురుకుల, స్టాఫ్ నర్స్ వంటి పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించింది. గ్రూప్-1 కూడా హైకోర్టు తీర్పును అనుసరించి గత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, ఎలాంటి కోర్టు కేసులు రాకుండా జాగ్రత్తలతో, పెంచిన పోస్టులతో కొత్త నోటిషికేషన్ జారీ చేసింది. కొత్త నోటిఫికేషన్ వివాదరహితంగా ఉన్నదని పోటీ పరీక్షల నిపుణులు చెబుతున్నారు. కాబట్టి నిరుద్యోగ అభ్యర్థులు ఎవరైనా కోర్టు కేసులతో మళ్లీ ప్రక్రియ ఆగుతుందనే ప్రచారాన్ని విశ్వసించవద్దని, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## స్పోర్ట్స్ పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు

**పెద్దపల్లి -ప్రభాతసూర్యుడు :** స్పోర్ట్స్ పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు తమ దరఖాస్తులను కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పి.నతానియల్ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ అర్హత గల గిరిజన విద్యార్థిని, విద్యార్థులను హైదరాబాద్ లోని వా టర్ స్పోర్ట్స్ అకాడమీ బోయిన్ పల్లి మోడల్ స్పోర్ట్స్ పాఠశాల జాతర్ల బాలుర (ఆదిలాబాద్ జిల్లా), కిన్నెరసాని బాలుర (బి.డి. కొత్తగూడెం జిల్లా), ఉట్నూర్ బాలుర (ఆదిలాబాద్ జిల్లా), కొత్తగూడ బాలుర (మహబూబాబాద్ జిల్లా). ఆసిఫాబాద్ బాలికలు (కె. బి ఆసిఫాబాద్ జిల్లా), కాచనపల్లి బాలికలు (బి.డి. కొత్తగూడెం జిల్లా) పాఠశాలలలో 2024-25 సంవత్సరమునకు గాను 5వ తరగతి లో ప్రవేశాల కొరకు ధరఖాస్తుల స్వీకరిస్తుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు తమ దరఖాస్తులు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, కరీంనగర్ కార్యాలయ పని వేళల్లో సమర్పించాలని, విద్యార్థుల వయస్సు 2024 ఆగస్టు 31 నాటికి 9 నుండి 11 సంవత్సరాల లోపు ఉండాలని అన్నారు. జిల్లా స్థాయి కమిటి ద్వారా దేహ దారుడ్య పరీక్షల అనంతరం ఎంపిక చేస్తారని కరీంనగర్ జిల్లాలో మార్చి 4 నుంచి 6 వరకు ఎంపిక ప్రక్రియ ఉంటుందని, మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ : 9059175379 నందు సంప్రదించాలని నతానియల్ పేర్కొన్నారు.

# సంపాదకీయమ్..

## సందేశ్ ఖలీలో ఏం జరుగుతోంది..

పశ్చిమ బెంగాల్.. గందరగోళంగా ఉంది. అలజడితో అట్టుడికిపోతోంది. ఎవరైతే మమతా బెనర్జీకి ఓటు బ్యాంకు అనుకున్నారో వారిలో తిరుగుబాటు వచ్చింది. మహిళలు రోకళ్లు, చీపుర్లతో బయటకు వచ్చి రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ధైర్యంగా బయటకు వచ్చి మాట్లాడుతున్నారు. దీన్ని తప్పించుకోవడం కోసం రకరకాల విన్యాసాలు చేస్తోంది సీఎం మమతా బెనర్జీ.ఆదివాసులు, దళితులు, ఓబీసీలకు నాయకత్వం లేదు సందేశ్ ఖలిలో.. దళితులు, ఆదివాసీలు ఇప్పుడు బీజేపీకి వెన్నుదన్నుగా నిలుస్తోంది. దేవుడు ఇంటెలెక్చువల్స్ అని చెప్పుకునే మేధావులు బీజేపీ ఎక్కడ ఎదుగుతుందోనని ఆ పార్టీకి వ్యతిరేకంగా విష ప్రచారం చేసి బెంగాల్ లో ఎదగకుండా చేశారు. పశ్చిమ్ బెంగాల్‌లోని నార్త్ 24 పరగనాస్ జిల్లాలో ఉంటుంది ఈ సందేశ్‌ఖలి. సుందర్‌బన్స్‌లో ఇదొక చిన్న ద్వీపం. బంగ్లాదేశ సరిహద్దుకు అతి సమీపంలో ఉంటుంది. ఈ ప్రాంతానికి వెళ్లాలంటే.. బోటు ఒక్కటే మార్గం!ఇంత చిన్న ప్రాంతం.. ఇప్పుడు దేశవ్యాప్తంగా వార్తలకెక్కింది. టీఎంసీ నేతలపై స్థానికులు, మరీ ముఖ్యంగా.. మహిళలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు."పార్టీ (టీఎంసీ) సభ్యులు ఇంటింటికి వెళతారు. అందమైన అమ్మాయి, అందమైన భార్య కోసం వెతుకుతారు. నచ్చితే.. వాళ్లని పార్టీ ఆఫీస్‌కు తీసుకెళతారు. ఒకటి కాదు రెండు కాదు.. చాలా రాత్రుళ్లు అక్కడే పెట్టుకుంటారు. వాళ్లు సంతృప్తి చెందే వరకు అక్కడే ఉంచుకుంటారు," అని ఓ మహిళ చెబుతున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "పెళ్లి కాకుండా కొందరు.. భర్తలుగా ప్రవర్తిస్తూ ఉంటారు. ఇంకొందరు పురుషులు.. ఏం చేయలేక.. తమ భార్యలను వదులుకోవాల్సి వస్తోంది. మమ్మల్ని బాధ పెడుతున్నారు. ఇక్కడి మహిళలకు భద్రత లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు," అని మరో మహిళ చెప్పుకొచ్చింది."మహిళలను టీఎంసీ పార్టీ ఆఫీసుకు తీసుకెళతారు. రాత్రంతా అక్కడే పెట్టుకుని ఉదయం వదిలేస్తారు," అని ఇంకో మహిళ వివరించింది.స ందేశ్‌ఖలి ప్రజలు ఆరోపణల్లో ఎక్కువగా వినిపిస్తున్న పేరు షేక్ షాజహాన్. ఆయన ఒక స్థానిక జిల్లా పరిషద్ సభ్యుడు. మహిళలందరు.. ఆయనే ప్రధాన నిందితుడు అని ఆరోపిస్తున్నారు. అత్యాచారాలు, లైంగిక దాడులే కాకుండా.. భూములు కూడా లాగేసుకున్నారని, ఆయనపై ఆరోపణలు ఉన్నాయి."షేక్ షాజహాన్, ఆయన సన్నిహితులు.. సందేశ్ ఖలిలో బీభత్సం సృష్టిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సమాజ హక్కులను అనేకమార్లు ఉల్లంఘించారు. మహిళల భద్రతకు విఘాతం కలిగించారు. ప్రజల భూములను బలవంతంగా లాక్కున్నారు," అని బీజేపీ ఎమ్మెల్యే సువేందు అధికారి మండిపడ్డారు. సందేశ్‌ఖలిలో రెండు రోజుల క్రితం హింసాత్మక ఘటన జరిగింది. టీఎంసీ సభ్యులకు వ్యతిరేకంగా పలు దుకాణాలను తగలబెట్టారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో 144 సెక్షన్ నడుస్తున్నట్టు తెలుస్తోంది. కాగా.. ఆ ప్రాంతంలో మహిళలు చాలా ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది. చెప్పులు, లాఠీలు పట్టుకుని వారందరు రోడ్ల మీదకు వచ్చినట్టు సమచారం.కేరళలో ఉన్న పశ్చిమ్‌బెంగాల్ గవర్నర్ ఆనంద్ బోస్.. సందేశ్‌ఖలి ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే, అక్కడి నుంచి బయలుదేరారు. తాజా పరిణామాలతో పశ్చిమ్ బెంగాల్‌లో రాజకీయ దుమారం చెలరేగింది. సీఎం మమతా బెనర్జీ మౌనంగా ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మమతా బెనర్జీ పాలనలో మహిళలకు భద్రత కరువైందని బీజేపీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ షేక్ షాజహాన్.. ఒక పవర్‌ఫుల్ టీఎంసీ లీడర్ అని తెలుస్తోంది. వాస్తవానికి గత కొన్ని నెలలుగా ఆయన పరారీలో ఉన్నారు. జనవరిలో ఆయన ఇంట్లో రైడ్ చేయడానికి ఈడీ ప్రయత్నించింది. కానీ వందలాది మంది టీఎంసీ కార్యకర్తలు.. ఈడీ వాహనాలను అడ్డుకుంది గందరగోళం సృష్టించారు. అదే అదనుగా ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇప్పటివరకు ఆయన జాడ కనిపించడం లేదని సమాచారంఅందుకే మోడీ మార్చి మొదటి వారంలో మూడు సార్లు బెంగాల్ కు వెళుతున్నారు. మార్చి 1న ఆరంభ, మార్చి 2వ తేదీ కృష్ణ నగర్, మార్చి 6 వ తేదీ బారాసత్.. బారాసత్ లో సందేశ్ ఖలీ ఉండడంతో ఈ మార్పు చోటుచేసుకుంది.బెంగాల్ లో మమతా బెనర్జీ కూడా సీరియస్ గా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పుడున్న పరిస్థితిని మార్చాలని.. ఇంటింటికి జనాలను పంపి.. పోలీసులను పంపి.. మార్చి 3న సీఎం మీటింగ్ ఉందని పెద్ద ఎత్తున మొబలైజ్ చేస్తున్నారు. బెంగాల్ లో ఢీ అంటే ఢీ అంటూ మోడీ, మమతా సవాల్ చేస్తున్నారు.

## అదనపు కట్నం కోసం దారుణం



**వరంగల్, ప్రభాతసూర్యుడు :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన బేతి విజయ- వెంకటేశ్వర్లు దంపతుల కుమార్తె అర్చన (28). ఆమెను వరంగల్ జిల్లా కొత్తవాడకు చెందిన కందగట్ల విజయలక్ష్మి- వెంకటయ్య దంపతుల కుమారుడు సందీప్‌కు ఇచ్చి 2022 డిసెంబరు 18న వివాహం జరిపించారు. కట్నంగా రూ. 8 లక్షలు కూడా ఇచ్చుకున్నారు. రెండు నెలలు కాపురం సవ్యంగానే సాగింది. కానీ ఆ తర్వాతే అత్తింటి వారి అసలు రూపాలు బయటపడ్డాయి. భర్త, అత్తింటివారు అదనపు కట్నం కోసం అర్చనను వేధించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో సందీప్‌కు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం రావడంతో కాపురం భాగ్యనగరానికి మార్చారు. అక్కడికి వెళ్లాక భర్త సందీప్ మరింతగా వేధించసాగాడు. అదనపు కట్నం కోసం అర్చనను శారీరకంగా, మానసికంగా హింసించాడు. ఆహారం కూడా పెట్టకుండా భార్యను నానాహింసలకు గురిచేశాడు. ఈ విషయాలన్నీ ఫోన్‌లో తరచూ తల్లిదండ్రులకు చెప్పి బాధపడేది.ఫిబ్రవరి 24న అగ్రంపహాడ్ సమ్మక్క- సారలమ్మ జాతర కోసం అర్చన దంపతులు వరంగల్‌కు వచ్చారు. ఆ మరుసటి రోజు అంటే ఫిబ్రవరి 25న రాత్రి అర్చన కుటుంబ సభ్యులకు సందీప్ ఫోన్ చేసి, ఆమెను వెంటనే తీసుకెళ్లాలని చెప్పాడు. ఆ ప్రకారంగానే 26న తల్లిదండ్రులతో వరంగల్ వెళ్లిన అర్చన ఆరోగ్యం అప్పటికే క్షీణించింది. అదేరోజు రాత్రి అపస్మారక స్థితికి వెళ్లడంతో కుటుంబ సభ్యులు వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భర్త, అత్తమామల వేధింపుల వల్లే తమ కూతురు మృతి చెందిందంటూ అర్చన తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ విలపించారు. మృతురాలి తల్లి విజయ మంగళవారం అల్లుడు సందీప్ సహా అతని కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# హిమాచల్‌లో ముదిరిన సంక్షోభం



**సిమ్లా, ప్రభాతసూర్యుడు :**
హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం ముదురుతున్న నేపథ్యంలో 15 మంది బీజేపీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి బహిష్కరించారు. సభలో నినాదాలు చేయడం, గందరగోళం సృష్టించిన కారణంగా బహిష్కరణకు గురయ్యారు. రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కి పాల్పడడం సంచలనమవుతోంది. ఈ క్రమంలోనే స్పీకర్ బడ్జెట్ సమావేశాలు జరుగుతుండగా బీజేపీ ఎమ్మెల్యేలపై వేటు వేయడం రాజకీయాల్లో మరింత వేడి రాజేసింది. బహిష్కరణకు గురైన వారిలో జైరామ్ ఠాకూర్, విపిన్ సింగ్ పర్మర్, బల్బీర్ వర్మ తదితరులున్నారు. అయితే...ఈ వేటు వేయకముందే బీజేపీ ఎమ్మెల్యే జైరామ్ ఠాకూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ నుంచి బీజేపీ ఎమ్మెల్యేలను బహిష్కరించే కుట్ర జరుగుతోందని అన్నారు. తమను బయటకు పంపించి బడ్జెట్‌ని ఆమోదించాలని భావిస్తున్నట్టు చెప్పారు. "బహుశా మమ్మల్ని అసెంబ్లీ నుంచి బహిష్కరించే కుట్ర జరుగుతోంది. స్పీకర్ కుల్‌దీప్ సింగ్ పఠానియా ఇదే చేస్తారనిపిస్తోంది. మమ్మల్ని బహిష్కరించి సభలో బడ్జెట్‌ని ఆమోదించాలని చూస్తున్నారు"- జైరామ్ ఠాకూర్, బీజేపీ ఎమ్మెల్యే ఇప్పటికే మంత్రి విక్రమాదిత్య సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. గతేడాది ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచి కాంగ్రెస్ క్రమంగా పతనమవుతూ వస్తోందని విమర్శించారు. అందుకే రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చేతిలో కాంగ్రెస్ ఓడిపోయిందని వెల్లడించారు. తన తండ్రి వీరభద్ర సింగ్ హిమాచల్ ప్రదేశ్‌కి ఆరుసార్లు ముఖ్యమంత్రిగా పని చేశారని, ఆయనకు గౌరవమిస్తూ ఓ విగ్రహం కూడా ఏర్పాటు చేయలేకపోయారని మండిపడ్డారు."మా నాన్న వీరభద్ర సింగ్ హిమాచల్ ప్రదేశ్‌కి ఆరు సార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆయన వల్లే ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. అయినా సరే ఆయన గౌరవార్థం ఓ విగ్రహం ఏర్పాటు చేయడానికి చోటు దొరకలేదు. మా నాన్నపై కాంగ్రెస్‌కి ఉన్న గౌరవం ఇదిమాకు ఈ పదవుల కన్నా భావోద్వేగాలే ముఖ్యం"- విక్రమాదిత్య సింగ్, హిమాచల్ ప్రదేశ్ మాజీ మంత్రి.

## కర్ణాటక అసెంబ్లీలో పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు



**బెంగళూరు, ప్రభాతసూర్యుడు :**
రాజ్యసభ ఎన్నికల్లో కర్ణాటకలో కాంగ్రెస్ అభ్యర్థి సయ్యద్ నాజిర్ హుస్సేన్ గెలుపొందారు. ఆ సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. అయితే..ఈ వేడుకల్లో కొంత మంది పాకిస్థాన్‌కి అనుకూలంగా నినాదాలు చేశారని బీజేపీ తీవ్రంగా ఆరోపిస్తోంది. పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసినట్టు బీజేపీ నేతలు ఆరోపించారు. ప్రస్తుతం దీనిపై రాజకీయ వేడి పెరిగింది. కాంగ్రెస్, బీజేపీ మధ్య వాగ్వాదం కొనసాగుతోంది. కర్ణాటక అసెంబ్లీ ప్రాంగణంలోనే ఇలాంటి నినాదాలు చేయడమేంటని ప్రశ్నించింది. ఇప్పటికే బెంగళూరు పోలీసులు ఈ కేసుని సుమోటోగా స్వీకరించింది. అయితే...ఈ వీడియోలో కాంగ్రెస్ జిందాబాద్, సిద్దరామయ్య జిందాబాద్ నినాదాలు మాత్రమే వినిపించాయి. బీజేపీ మాత్రం పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలే వినిపించాయని తేల్చి చెబుతోంది. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తోంది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ ఆరోపణలపై స్పందించారు. బీజేపీ ఆరోపిస్తున్నట్టుగా పాకిస్థాన్‌కి అనుకూలంగా ఎవరైనా నినాదాలు చేసుంటే...కచ్చితంగా వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. అంతే కాదు. ఈ ఆరోపణలపై ఈనీతీవనిబతిఇ ాఇతివనిఇవ ఒజీఏ (ఈూఒ) విచారణ చేపట్టాలని ఆదేశించారు. కర్ణాటకలోని నాలుగు రాజ్యసభ సీట్లలో కాంగ్రెస్ మూడు గెలుచుకుంది. మరోటి క్రాస్ ఓటింగ్ ద్వారా బీజేపీ విజయం సాధించింది. ఇదే సమయంలో ఆ ఆరోపణల్ని ప్రభుత్వం కొట్టి పారేసింది. కాంగ్రెస్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేసి అలజడి సృష్టించినందుకు బీజేపీ నేతలపై ఫిర్యాదు చేసింది. అటు కర్ణాటక డిప్యుటీ సీఎం డీకే శివకుమార్ కూడా తీవ్రంగా స్పందించారు. ఇదంతా బీజేపీ కుట్ర అని విమర్శించారు. ఇలాంటి అవాస్తవాలు ప్రచారం చేసే వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. "ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కి ఆ వాయిస్ రిపోర్ట్ పంపించాం. ఈ రిపోర్ట్ వచ్చిన తరవాతే దీనిపై ఓ స్పష్టత వస్తుంది. ఈ విచారణలో ఎవరైనా నిందితులు అని తేలితే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా శిక్షిస్తాం"- సిద్దరామయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి.

## సూర్యాపేట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

### ఆర్టీసీ బస్సు ఢీ.. ముగ్గురు మృతి



**సూర్యాపేట - ప్రభాతసూర్యుడు :**
సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మోతేకు దగ్గరలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై మధిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కూలీలతో వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ప్రమాద సమయంలో ఆటోలో మొత్తం 12 మంది ఉన్నారని, వారంతా కూలీ పనుల కోసం వెళ్తుండగా ప్రమాదం బారినపడ్డారని పోలీసులు తెలిపారు.మునగాల మండలం రామసముద్రానికి చెందిన కూలీలు మోతె మండలం బుర్కచర్లలో మిరప పనులకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. క్షతగాత్రులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



## త్వరలోనే అర్హులందరికి కొత్త రేషన్ కార్డులు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :**
పదవులు, అధికారం శాశ్వతం కాదని, చేసిన పనులే చరిత్రలో నిలిచిపోతాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను క్రమంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఏది ఏమైనా ఇచ్చిన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు.ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీలను కూడా నెరవేరుస్తామన్నారు. అలాగే త్వరలోనే అర్హులందరికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ధరణిలో సవరణలు చేసి ఎలాంటి సమస్యలు లేకుండా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.



## ఖమ్మం కార్పోరేషన్‌లో విజిలెన్స్ సోదాలు

**ఖమ్మం - ప్రభాతసూర్యుడు :**
ఖమ్మం కార్పొరేషన్ ఆఫీస్ లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు చేశారు.గత ప్రభుత్వ పాలనలో జరిగిన అక్రమలు , ఖబ్జాల పై ఫిర్యాదులు రావడముతో వరంగల్ విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ బాలకోటి ఆద్వర్యంలో అధికారుల బృందం కార్యాలయంలో దాడులు చేపట్టారు.ఇంతకు ముందు కూడా కార్పొరేషన్ ఆఫీస్ లో తనిఖీలు చేసిన అధికారులు విలువైన పత్రాలు తీసుకెళ్లినట్లు సమాచారం.మున్సిపల్ కమిషనర్ కు జిల్లా కలెక్టర్ గౌతం కు అక్రమాలు కబ్జాలపై ఫిర్యాదులు అందడంతో ఇప్పటికే ప్రభుత్వ భూమికి పెన్సింగ్ వేసి అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు కూడా నమోదు చేశారు. ఇంతకు ముందు అందిన ఫిర్యాదులపై ఇప్పుడు మళ్లీ తాజాగా కార్పొరేషన్ కార్యాలయంలో విజిలెన్స్అధికారులు దాడులు చేపట్టారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215